

# హైదరాబాద్ వార్త


# చట్టం వారికేనా..వీరికి వర్తించదా..?

- జిహెచ్ఎంసి యాక్టుకు తూట్లు పొడుస్తున్న అధికారులు
- నిబంధనలు పాటించకుండా బడ్జెట్ పెండింగ్
- స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని దాటవేస్తున్న మేయర్
- సంఖ్యాబలం లేకనే వెనకంజ వేస్తున్నారన్న ఆరోపణ




**హైదరాబాద్,డిసెంబర్ 18, ప్రభాతవార్త :** గ్రేటర్ వాసులకు అత్యవసర సేవలందించే జీహెచ్ఎంసీకి దిశానిర్దేశం చేసే జీహెచ్ఎంసీ యాక్టుకు అధికారులే తూట్లు పొడుస్తున్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ చట్టం ప్రకారం నవంబర్ 10 నుంచి డిసెంబర్ 15 వరకు స్టాండింగ్ కమిటీలో బడ్జెట్ ముసాయిదాను ఆమోదించాలంటూ చెబుతున్నా, అధికారులు, పాలక మండలి మాత్రం చట్టాన్ని బేఖాతరు చేస్తూ బడ్జెట్ ను పక్కన పెట్టినట్లు కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం గ్రేటర్ పరిధిలోని 19.25 లక్షల మంది ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపుదారులు చట్టాన్ని గౌరవిస్తూ మార్చి 31 వరకు చెల్లింపులు జరుపుతున్నారు. ఇదే చెల్లింపుదారులు మార్చి 31 డెడ్ లైన్ దాటితే చెల్లింపుదారులపై జీహెచ్ఎంసీ చట్టం ప్రకారంగా జరిమానాలు, వడ్డీలను విధిస్తున్న అధికార యంత్రాంగం మాత్రం అదే చట్టాన్ని ఆచరించకుండా వ్యవహారించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే వర్తమాన ఆర్థిక సంవత్సరం (2024-25)కు బడ్జెట్ సవరణలు జరపాల్సి ఉంది. ఇదే సమయంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)బడ్జెట్ అంచనాలను ఖరారు చేయాల్సిన బాధ్యత మేయర్, జీహెచ్ఎంసీ కమిషనర్లపై ఉంది. కానీ ఇప్పటి వరకు బడ్జెట్ ముసాయిదానే రూపొందించలేదు. ప్రాథమికంగా అధికారులు రూపకల్పన చేసిన 2025-26 కు అధికారులు ప్రాథమికంగా రూపకల్పన చేసి రూ. 8340 బడ్జెట్ ముసాయిదాపై గత నెల 30వ తేదీన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించినా, సభ్యులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో ఈ నెల 9వ తేదీ తర్వాత మరోసారి స్టాండింగ్ కమిటీ సమావేశ పరిచి, బడ్జెట్ ను ఆమోదిస్తామని కేవలం ప్రకటన చేశారు. దాదాపు పదిరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు దానిగురించి పట్టించుకోకపోవడమే కాకుండా బడ్జెట్ అంచనాలను మూలన పడేశారు.

**స్టాండింగ్ కమిటీ మీటింగ్ అంటేనే భయమెందుకో..**

జిహెచ్ఎంసి పాలక మండలికి బాస్‌గా వ్యవహారించే మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఈ మధ్య స్టాండింగ్ కమిటీ అంటేనే భయం పట్టుకుందంటూ ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. గతంలో మజ్లీస్ కార్పొరేటర్లు కొందరు కొన్ని ప్రతిపాదనలను మేయర్‌కు సమర్పించగా, మేయర్ వాటిని పట్టించుకోలేదని అప్పటి నుంచి మేయర్ పై మజ్లీస్ కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే స్టాండింగ్ కమటీలోని 15 మంది సభ్యుల్లో సగం మంది మజ్లీస్ కార్పొరేటర్లే ఉండటంతో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తే, మజ్లీస్ కార్పొరేటర్ల నుంచి ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనన్న భయం మేయర్‌ను వెంటాడటం, కొత్త సంవత్సరం బడ్జెట్ కు గ్రహణంగా మారిందని కొందరు కార్పొరేటర్లే బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు.

**సంఖ్యా బలం లేకనేనా..**

మొత్తం 150 మంది కార్పొరేటర్లున్న బల్దియా కౌన్సిల్‌లో కాంగ్రెస్ కు అధికారింగా ఇద్దరు మాత్రమే కార్పొరేటర్లున్నారు. ప్రస్తుత మేయర్ విజయలక్ష్మి 2020లో జరిగిన బల్దియా ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచారు. 2024 లో అధికార మార్పిడి జరిగి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆమె అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆమెకు వ్యతిరేకంగా గళం విన్పిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ అనధికార మిత్రువైన మజ్లీస్ పార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ మద్దతుగా ఉంటారని భావించగా, వారు కూడా మేయర్ తీరుపై అసహనంగా ఉండటంతో మేయర్ బడ్జెట్‌ను ఆమోద దిశగా తీసుకెళ్లకుండా కాలయాపన చేస్తున్నట్లు కార్పొరేటర్లు గుసగుసలాడుతున్నారు.

# విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

- -ప్రతి తరగతికి ప్రత్యేక పఠన ప్రణాళిక అమలు చేయాలి
- -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, డిఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 18,ప్రభాతవార్త:** జిల్లాలో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా విద్యార్థులకు సరళమైన రీతిలో నాణ్యమైన విద్యా బోధన చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి క్లాస్ రూమ్ లో 75 శాతం మంది పిల్లలకు చదవడం రావాలని, చదవడం రాయడం అభ్యాస మెరుగుదల కోసం ప్రత్యేక పఠన ప్రణాళికను అమలు చేయాలన్నారు. క్లాస్ రూమ్ పరిశీలనకు వెళ్ళినప్పుడు నిర్మాణాత్మకమైన విశ్లేషణ చేయాలని, విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉపాధ్యాయులు ఉండాలని సూచించారు. తరగతిగది పరిశీలనకు వెళ్ళినప్పుడు వర్క్ షీట్ లను కచ్చితంగా పిల్లలతో చేయించాలని రివ్యూ చేసి కరెక్షన్లు చేయాలన్నారు. సోమవారంలోగా బ్యాక్ లైన్ టెస్ట్ చేయాలని సూచించారు. అలాగే కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల నోడల్ అధికారులు 100 పాఠశాలలను సందర్శించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై, పాఠశాలల్లో నల్ల కలెక్షన్, డ్యూయల్ డెస్క్, మధ్యాహ్న భోజనం సమీక్ష, పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఆ రోహిణి, ఉమాదేవి, డిప్యూటీ ఈఓ లు, డిప్యూటీఐఓఎస్ లు, కాంప్లెక్స్ హెడ్మా స్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పార్కు స్థలాలు అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా కఠిన చర్యలు

- -ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయండి
- -2వేల చదరపు గజాలకంటే ఎక్కువ ఉంటే పార్కులుగా తీర్చిదిద్దండి
- -అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఇలంబర్తి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 18,ప్రభాతవార్త:** కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను చీఫ్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం సమన్వయంతో డిజిటైజ్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్ లతో కలిసి కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటైజ్ చేయాలి ప్రతి ట్రీ పార్కులకు, ఖాళీ స్థలాలకు ప్రత్యేక ఐ.డి ఇవ్వాలని తెలిపారు. 2000 చదరపు గజాల కంటే ఎక్కువ ఖాళీ ప్రదేశాలను పార్కులుగా అభివృద్ధి చేయాలన్నారు. పార్క్ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని, ఏదైనా ఉల్లంఘనలు గుర్తించబడితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని సర్కిల్ మేనేజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పార్కులను కనీసం నెలకు ఒక సారి సందర్శించి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ లతో సమావేశాలు నిర్వహించి పార్క్ తనిఖీ నివేదిక ఫార్మాట్ ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు అర్బన్ బయోడైవర్సిటీ అదనపు కమిషనర్‌కు నివేదిక సమవర్పించాలని తెలిపారు. పార్క్ నిర్వహణ గురించి వాకర్స్, స్టేక్ హోల్డర్స్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యుల నుండి అభిప్రాయాన్ని తెలుసుకొని, సందర్శకుల నుండి వచ్చిన ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా కాంట్రాక్టర్‌లకు చెల్లింపులను విడుదల చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పార్క్ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను నిరోధించడానికి ఒక ప్రతిపాదనను సమర్పించాలి, దానిని నియంత్రించే పద్ధతులు చేపట్టాలన్నారు. సెక్యూరిటీ గార్డుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవలని పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సెక్యూరిటీ కృషి చేయాలన్నారు. పావురాలను బహిరంగ ప్రదేశాల్లో తినిపించడం వల్ల పట్టణ ప్రాంతాల్లో జీవవైవిధ్యం ఇబ్బంది కారంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో పశు వైద్య విభాగం సంప్రదించి బహిరంగ ప్రదేశాల్లో పావురాల దాణాను వేయకుండా మార్గాలను పరిశీలించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, శ్రీనివాసరావు, సునంద రాణి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, విజిలెన్స్ విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీనివాస్,అదనపు కమిషనర్ ఎస్టేట్,సామ్రాట్ అశోక్, అదనపు కమి షనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, జాయింట్ కమిషనర్ ఐటీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు అగ్రస్థానం అభినందనీయం : దర్శకుడు రాఘవేంద్రరావు



సారంగం ఫిల్మ్ అవార్డ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాఘవేంద్రరావు, ఖాజా తదితరులు

**రవీంద్రభారతి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** అన్నిరంగాలతోపాటు తెలుగు సినీరంగంలో ప్రతిభను చాటుతున్న నటీనటులకు అగ్రతాంబూలమివ్వడం అభినందనీయమని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు అన్నారు. ఈమేరకు తన క్యాంపు కార్యాలయంలో ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ సారంగి ఈ నెల 22 ఆదివారం రాత్రి 6గంటల నుండి రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో ప్రతిభావంతులైన తెలుగు సినీనటులకు బహూకరించనున్న ప్రతిష్టాత్మక సారంగి ఫిల్మ్ అవార్డుల పోస్టర్‌ను సంస్థ అధినేత, సీనియర్ పాత్రికేయుడు ఖాజా ఆఫ్రిది, శ్రీకాంత్, సన్నీ, సుమన్ తదితరులతో కలిసి ఆవిష్కరించి, యజ్ఞతుల్యమైన మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఖాజాకు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అఫ్రిది సామాజిక సేవారంగంలో తమ సంస్థ పదేళ్లుగా అనేకమంది దివ్యాంగులకు చేయూత అందించడంతోపాటు వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సారంగి సాంస్కృతిక ప్రయాణంలో సారంగి ఫిల్మ్ అవార్డుల ప్రదానం కలికితురాయని, ఏరంగంలోనైనా ప్రతిభను అందలం ఎక్కించడం తమ సంస్థ ధ్యేయం, లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోనే పలువురు సామాజికవేత్తలను కూడా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, గౌరవ అతిథిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతోపాటు దిల్‌రాజు, వేణు తదితర సినీప్రముఖులు పాల్గొనున్నట్లు, అధికసంఖ్యలో సినీప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖాజా ఆఫ్రిది కోరారు.

# పెళ్లిగోల..మాయలీల...!

- -నగరంలో పెట్రేతుగుతున్న నకిలీ మ్యాట్రిమోనీలు
- - పెళ్లిళ్ల పేరుతో లక్షలు దోచేస్తున్న కేటుగాళ్లు
- -అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

**హైదరాబాద్, డిసెంబరు 18 ,ప్రభాతవార్త:** మూడు పదులు దాటిన వయస్సు..ముదురు బెండకాయ అంటూ బంధుగణం విమర్శలు.. నచ్చిన సంబంధం కోసం నానా తంటాలు..ఏదో ఒక పెళ్ళి సంబంధం ఖాయం చేసుకుందామనే ఆలోచనతో ఆన్‌లైన్‌లో వెతుకులాట..అందమైన వదువు ఉందనే ప్రకటన కనిపించగానే పరుగెత్తుకుంటూ వెళ్లడం.బ్రహ్మాచారుల పెళ్లిపాట్లను పసిగట్టిన మాయగాళ్లు సరికొత్త మోసాలకు శ్రీకారం చుట్టారు. చేతికి అందినంత లాగేసి వదిలేస్తున్నారు. అమాయకులకు వల విసిరేందుకు ప్రకటనలు,సోషల్‌మీడియా వేదికలుగా మారాయి. వీరి వలలో చిక్కి సొమ్ముపోగొట్టుకున్న బాధితుల్లో ఎక్కువగా సంపన్న వర్గాలకు చెందిన వారు, విద్యావంతులే ఉంటున్నారు. ఇటీవల మ్యారేజ్ బ్యూరోల చేతిలో మోసపోయి చాలామంది పోలీసులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు వసూలు చేయడమే టార్గెట్‌గా కేటుగాళ్లు మ్యాట్రిమోనీల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకు భర్తతో విడిపోయి..ఒంటరిగా ఉంటూ,ఉన్నత ఉద్యోగాలు ,వ్యాపారాలు బాగా డబ్బున్న వారిని ఎంచుకుంటున్నారు.వారి అమాయకత్వాన్ని ఒంటరి తనాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. మీకు మేమున్నాం అని భరోసా కల్పించి ఒంటరి జీవితంలో ఆశలు రేకెత్తిస్తున్నారు. మాయ మాటలతో మచ్చిక చేసుకుని,వారి బలహీనతను అడ్డంపెట్టుకుని,వివిధ రకాల కారణాలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. ఆతర్వాత ముఖం చాటేసి అడ్రస్‌లేకుండా పోతున్నారు. తాము మోసపోయామని గ్రహించిన కొందరు పోలీసులు,కోర్టులు, కేసులు అంటూ తిరిగి సమాజంలో పలుచన కావడం ఇష్టం లేక మిన్నుండిపోతున్నారు.



**పెళ్ళి చూపులా మజాకా..**

ఆన్‌లైన్‌లో ప్రకటనలు చూసి మ్యారేజ్ బ్యూరోలకు వెల్లడమే ఆలస్యం..రిజిస్టేషన్ పేరుతో రూ.2000 నుండి 5000వేల వరకు వసూలు చేస్తారు. రిజిస్టేషన్ తంతు ముగియగానే పెళ్లిచూపుల నాటకం ప్రారంభిస్తారు.తమ వద్ద పనిచేసే టెలికాలర్స్,రోజువారి జీతానికి ఏర్పాటు చేసిన విద్యార్థినులతో తమ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకునున్న వారికి ఫోన్‌లు చేయిస్తారు. నవ్వుతూ మాట్లాడిస్తారు. అవతలి వ్యక్తుల ఆస్తిపాస్తులు,కుటుంబ నేపథ్యం తదితర వివరాలు సేకరిస్తారు. పార్కులు హోటళ్లలో పెళ్లిచూపులంటూ పిలిపించి ఇద్దరినీ ఒకేచోట చేర్చుతారు. ఆఅమ్మాయిలతో పుట్టిన రోజు డ్రామా ప్రారంభిస్తారు. చీరలు నగలు,బహుమతులు గుంజుతారు. ఏకాంతంగా ఉన్నఫోటోలు తీస్తారు,మాయనాటకం ముగిశాక బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. ఇటీవల అమీర్‌పేట్‌లో హాస్టల్లో ఉంటూ బుద్దిగా చదువుకునే ఓయువకుడు ప్రకటన చూసి మ్యారేజ్ బ్యూరోను ఆశ్రయించాడు. పేరునమోదు చేసుకుని వారం రోజులతర్వాత కూకట్‌పెళ్ళిలోని ఓహోటళ్లో పెళ్లి చూపులు ఏర్పాటు చేశారు. నలభై ఏళ్లమహిళలకు మేకప్ వేసి అతడికి పరిచయం చేశారు.యువకుడు ఆమె తనకు నచ్చలేదని చెప్పడంతో నానా గొడవ చేశారు. పరువుపోతుందని భయపడిన ఆయువకుడు తన మెడలో ఉన్న బంగారు గొలుసు ఇచ్చి బయటపడాల్సి వచ్చింది.

**విగ్గు పెట్టి.. డబ్బున్నోడిగా బిల్డప్ ..50 మందితో పెళ్లి**

గచ్చిబౌలిలో ఉండే వంశీకృష్ణ తనను తాను ధనవంతుడిగా మ్యాట్రిమోనీ సైట్‌లోపరిచయం చేసుకుంటాడు. నెత్తి మీద సరిగ్గా జుట్టే లేకపోయినప్పటికీ విగ్గులు పెట్టుకుని, లుక్ మార్చుతూ ఫొటోలు అప్లోడ్ చేస్తాడు. మ్యాట్రిమోనీలో వరుడి కోసం వెతుకుతున్న అమ్మాయిలకు, అమ్మాయి తల్లిదండ్రులకు అందగాడు, డబ్బునోడు అనే ఫీల్ క్రియేట్ చేస్తాడు. అతని వలలో పడిన అమ్మాయిలను పెళ్లి చేసుకుని, లక్షల కట్నం దండుకుని కొన్నాళ్లకు ముఖం చాటేస్తాడు. మరో గెటప్ తో మళ్లీ ప్రొఫైల్ అప్ లోడ్ చేస్తాడు. ఆ వచ్చిన డబ్బులతో రాయల్ లైఫ్ లీడ్ చేస్తుంటాడు. సింపుల్‌గా చెప్పాలంటే.. వంశీకృష్ణ దందా ఇది. ఇలా విగ్‌లు పెట్టుకుని, వేషాలు మారుస్తూ మోసాలకు పాల్పడుతున్న వంశీకృష్ణ దాదాపు 50 మంది అమ్మాయిలను పెళ్లి చేసుకుని మోసం చేశాడు. ఒక లేడీ డాక్టర్‌ను కూడా ఇలానే పెళ్లి చేసుకుని మోసం చేయగా.. ఇతని మోసాన్ని గ్రహించిన ఆ డాక్టర్ తండ్రి ధైర్యం చేసి సైబర్ క్రైం పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో ఇతగాడి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి నిత్య పెళ్లిళ్ల కేసుల్లోనే ఇప్పటికే పలు మార్లు అరెస్టయి జైలుకు వెళ్లివచ్చినా వంశీకృష్ణ బుద్ధి మాత్రం మారలేదు.

# సహచర నటిపై వేధింపులు.. యూట్యూబర్ బెహరాప్రసాద్ అరెస్ట్

### 14రోజులు రిమాండ్ విధించిన కోర్టు



**హైదరాబాద్, డిసెంబరు 18,ప్రభాతవార్త:** సహచర నటిని వేధించిన యూట్యూబర్ కేసులో బెహరా ప్రసాద్ జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మణికొండకు చెందిన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఓ వెబ్‌సిరీస్ షూటింగ్ సమయంలో ప్రసాద్ తనకు పరిచయమయ్యాడని యువతి తెలిపింది. షూట్ లో భాగంగా అసభ్యంగా ప్రవర్తించాడని.. నిలదీయడంతో క్షమాపణలు చెప్పాడని పేర్కొంది. కొద్ది రోజుల తర్వాత మరో వెబ్ సిరీస్‌లో కలిసి పనిచేశామని, ఆ సమయంలో అందరి ముందు అసభ్యంగా ప్రవర్తించాడని యువతి తెలిపింది. ఇదేమిటని ప్రశ్నించగా అసభ్య పదజాలంతో దూషించాడని, ఈ నెల 11న షూటింగ్ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో యూనిట్ అందరి ముందు తనపై దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రసాద్‌ను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# పుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించిన అధికారులు

- -ఆక్రమదారులపై కఠిన చర్యలు
- -సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్



**అత్తాపూర్ డిసెంబరు18,ప్రభాతవార్త :** రోడ్డు,పుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ పేర్కొన్నారు.జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో డిసి రవి కుమార్ ఆదేశాల మేరకు బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీగూడ,వంబెకాలనీ పుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారుల సంబంధించిన నిర్మాణాలను పోలీసు బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి అధికారులు కోరాడా ఝూలిపించారు.అధికారులు కూల్చీవేత్తలు చేస్తుండగా పుట్‌పాత్ ఆక్రమణదారులు అధికారులను అడ్డుకున్నారు.దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.ఈ సందర్భంగా ఎసిపి శ్రీధర్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ....పుట్‌పాత్‌ల ఆక్రమణతో స్థానికుల తీవ్ర ఇబ్బంది అవుతుందని స్థానికులు ఫీర్యాదు చేయడంతో రోడ్డును ఆక్రమించిన వారికి సంబంధించిన 16 షెడ్లను తొలగించడం జరిగిందని తెలిపారు.ఎవరైన పుట్‌పాత్,రోడ్డులను ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పరాన్నజీవుల నియంత్రణ,చికిత్సపై కొనసాగిన శాస్త్రీయ సదస్సు

### -రెండో రోజు కొత్త చికిత్స విధానాలపై చర్చ



**అత్తాపూర్ డిసెంబరు18 ,ప్రభాతవార్త :** పీవీ నరసింహారావు తెలంగాణ పశువై ద్య విశ్వవిద్యాలయం, పశు వైద్య కళాశాల, పరాన్నజీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో మూడు రోజులపాటు జరుగుతున్న 33వ నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ వెటర్నరీ పారాసిటాలజీ, నేషనల్ సింపోజియమ్ రెండో రోజున బుధవారం వివిధ శాస్త్రీయ సమావేశాలు నిర్వహించబడ్డాయి. అడవి జంతువు లు, పౌల్ట్రీ, జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులపై ప్రభావం చూపే పరాన్నజీవుల నియంత్రణ, చికిత్స పై శాస్త్రీయ సదస్సు లు నిర్వహిం చారు. ఈ సదస్సులో పరాన్నజీవుల ద్వారా జంతువులకు, మనుషులకు వ్యా పించే వ్యాధులను నియంత్రించడానికి ఆధునిక పరిశోధనలపై వివరాలు వెల్లడిం చారు. నూతన చికిత్స, బయోలాజికల్ నియంత్రణ విధానాలపై రసాయనిక మందులకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చెందుతున్న కొత్త చికిత్స విధానాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో అనేక ప్రతిష్టాత్మక శాస్త్రజ్ఞులు, పీజీ, పీహె చ్‌డీ విద్యార్థులు తమ పరిశోధనలను పంచుకోవటం ద్వారా ఈ రంగంలో మరి ంత అభివృద్ధి సాధించడానికి కొత్త మార్గాలు అన్వేషించారు. ఉత్తమ ఆవిష్క రణలు పరిశోధనలు చేసిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, ఉత్తమ థీసిస్, జేపీ దుబే, ఐ ఏఏ ఈపి యంగ్ సైంటిస్ట్ అవార్డులను ఈ కార్యక్రమంలో ప్రదా నం చేశారు. సమావేశాలకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శారత్చంద్ర, డిఆర్ ప్రొఫెసర్ హరికృష్ణ, డిఈ ఎం. కిషన్ కుమార్, ఈ కార్యక్రమ రూపకర్త, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ ఉదయ కుమార్, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరైయ్యారు.

# శ్రీస్వామి అయ్యప్పను సాక్షాత్కరించిన పద్యనాటకం



శ్రీ స్వామి అయ్యప్ప పద్యనాటకంలో దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్యల సౌజన్యంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్, రుద్రశివ సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో తొమ్మిది రోజులపాటు జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పద్యనాటక పోటీల్లో ఏడవరోజు బుధవారం టిబిఆర్ ఆర్ట్స్ క్రియేషన్, పటాన్‌చెరు వారి నిర్వహణలో ఇందిరాదేవి దర్శకత్వంలో శ్రీస్వామి అయ్యప్ప పద్యనాటక ప్రదర్శన ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసింది. అనంతరం పుచ్చా సాంబశివారెడ్డి శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం, చింతల్ పద్మానగర్ భగవద్గీత సత్సంగ్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, అర్చన విద్యార్థులచే కూచిపూడి నృత్యప్రదర్శనలు కమనీయంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు బాపనపల్లి పరమేశ్వర్, హరిప్రసాద్, సలహాదారు శివనారాయణ తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేసి ఎంతగానో అభినందించారు.

### 2వ పెళ్లి చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి : నవ్య ఆవేదన


ఇంటి ముందు ధర్నా చేస్తున్న భార్య

కంటోన్మెంట్,డిసెంబర్ 18 ప్రభాతవార్త: కట్టుకున్న భార్యను వదిలేసి 2వ భార్యతో జల్సాలాడుతున్న తన భర్తపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ భర్త ఇంటి ముందు ధర్నా నిర్వహించిన సంఘటన మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పికెట్‌లో నివాసం ఉంటున్న ఉదయ భాస్కర్ రెడ్డి, నవ్యలకు 2017లో వివాహం జరిగింది. పెళ్లి ఆయన తరువాత వీరిద్దరు ఆమెరికాలో సంవత్సరం పాటు కాపురం చేశారు. తరు వాత భార్యను నగరానికి పంపించాడు. భర్త ఉదయ్ భాస్కర్ రెడ్డి ఆమెరికాలో ఓ అమ్మాయిని పెళ్లి చేసుకొని తానకు విడాకులు ఇవ్వక ముందు మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని బాధితురాలు నవ్య పికెట్ లోని భర్త ఇంటి ముందు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న మారేడ్‌పల్లి పోలీసులు ఆమెకు నచ్చజెప్పి ఈ కేసు కోర్టులో కొనసాగుతుండగా ధర్నా చేయడం సరైంది కాదని ఆమెకు నచ్చజెప్పి పంపించారు.

### సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కూకట్‌పల్లి ఎసిపి


నేరాల పట్ల కల్పిస్తున్న కూకట్‌పల్లి ఎసిపి

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 18, ప్రభాతవార్త
ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయిందని, ప్రతి నిమిషం సెల్ ఫోన్ లేనిది ఏ పని చేయలేకపోతున్నారని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ పేర్కొన్నారు. బుధవారం కూకట్‌పల్లి మెట్రో మాల్‌లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో సైబర్ టీమ్‌తో పాటు కూకట్పల్లి ఏసీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా, పాన్ కార్డ్, ఆధార్ కార్డు, పెన్షనుకు సెల్ నంబర్ అవసరంగా మారిందన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్ళ ప్రజలకు ఏదో ఒక ఆశ చూపి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వారి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరం జరిగిన తర్వాత నేరస్థులను పట్టుకోవడం కంటే అసలు నేరం జరగకుండా ప్రజలు జాగ్రత్త పడాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. సైబర్ క్రైమ్ గురించి అందరం కలిసి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కూకట్పల్లి ఏసిపి సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్


సర్వేను పరిశీలిస్తున్న వీ.పీ గౌతమ్, అధికారులకు

నిజాంపేట్, డిసెంబర్ 18, ప్రభాతవార్త
నిజాంపేట్ నగరపాలక సంస్థ పరిధిలో జరుగుచున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే యొక్క తీరును బుధవారం హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ గౌతమ్, ఐఏఎస్ రాధిక గుప్తా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ఆకస్మికంగా సందర్శించినారు. సర్వే జరుగుతున్న తీరుని పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈ ప్రక్రియని 31 తారీకు డిసెంబర్ లోగా పూర్తి చేయాలని కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలాంటి తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ గౌతమ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆటోడ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయి :ఎమ్మెల్యే


ఆటో డ్రైవర్లకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 18, ప్రభాతవార్త
రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చాకే ఆటోడ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయని, తెలంగాణలో ఆటోడ్రైవర్లు జీవించే పరిస్థితి లేకుండా పోయిందని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కూకట్పల్లిలోని ఆటో కార్మికులును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ లు కలిసి మద్దతు తెలుపుతూ బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు మీకు అండగా ఉంటుందని, సమస్యలపై కచ్చితంగా పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ బస్సుతో నష్టపోతున్న ఆటోవాలాలకు ప్రతినెలా రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు పట్ల రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న వ్యతిరేక నిర్ణయాల వల్ల ఉపాధికి గండిపడుతుందని ఆటో డ్రైవర్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

### నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ


జిటియస్ కాలనీలో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఇంజనీర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 18, ప్రభాతవార్త :
వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జిటియస్ కాలనీలో నూతనంగా నిర్మించిన తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్ భవనాన్ని ప్రారంభించారు. ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన భవనం ప్రారంభంతో పాటు మొబైయిల్ యాప్‌ను, నూతన సంవత్సర కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పివిబి వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎమ్ అనీల్ కుమార్, అసోసియేట్ ప్రసిడెంట్ కె.కుమారస్వామి, అడిషనల్ జనరల్ సెక్రటరీ పి.రాజశేఖర్, మాజీ అసోసియేషన్ అధ్యక్షులు రవిందర్ కుమార్, మాజీ సెక్రటరీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు తెలుగుజాతికి అవమానం

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ముషీరాబాద్, డిసెంబర్ 18, ప్రభాతవార్త: ఎన్టీఆర్ ఘాట్‌లో సచివాలం, అసెంబ్లీ నిర్మించాలంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలుగు జాతికే అవమానంగా ఉన్నాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ధ్వజమెత్తారు. బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని, తెలుగు భాష ఔచిత్యాన్ని, తెలుగుజాతి మనుగడను కాపాడిన మహావ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన జ్ఞాపకార్థం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్మించిన ఎన్టీఆర్ ఘాట్‌లో సచివాలయం, అసెంబ్లీ నిర్మించాలని ప్రతిపాదించటం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రి పదవుల కోసం ఢిల్లీ పెద్దల మెప్పుకోసం తాపత్రయపడుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. నిత్యం వేలాదిమంది సందర్శించే ఎన్టీఆర్ ఘాట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎన్టీఆర్ అభిమానులుగా, టీడీపీ కార్యకర్తలుగా మేము ఊరుకోబోమని హెచ్చరించారు. సాయుధ పోరాటాల జిల్లా నల్గొండలో పుట్టిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన ఉనికిని మరిచిపోయి మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి మెప్పుకోసం ఇష్టానుసారం నోరు పారేసుకోవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## అందరి హృదయాల్లో నిలిచి ఉండే మాధవపెద్ది సత్యం : కె.వి.రమణాచారి


పద్మశ్రీ కోటశ్రీనివాస్‌రావుకు 'శ్రీభారతి-మాధవపెద్ది సత్యం స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న మాధవపెద్ది సత్యం కుమారుడు, డాక్టర్ మాధవపెద్ది మూర్తి, డాక్టర్ కె.వి.రమణాచారి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త: తెలుగు సినిమాలో గానసరస్వతి లోకంలో ఉన్నంత కాలం మాధవపెద్ది సత్యం అందరి హృదయాల్లో ఉంటారని వక్తలు కీర్తించారు. శ్రీభారతి ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో శతాబ్ది గాయకులు మాధవపెద్ది సత్యం వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని పద్మశ్రీ కోటశ్రీనివాస్‌రావుకు 'శ్రీభారతి-మాధవపెద్ది సత్యం స్మారక పురస్కారం-2024'తో పాటు 'విశ్వనట చైతన్యభారతి' బిరుదును ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు చింతలపాటి సురేశ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మాధవపెద్ది సత్యం కుమారుడు, 'కలైమామణి' ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ మాధవపెద్ది మూర్తి, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి చేతులమీదుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి ప్రసంగించారు. సభను ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్ ప్రారంభించగా కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఎం.కృష్ణ కిషోర్‌రెడ్డి, ప్రముఖ నిర్మాత శివ కంఠంనేని, ప్రముఖ పారిశ్రామికవేత్త రావుల వెంకటేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ, ప్రముఖ సాంస్కృతిక సంఘసేవకులు తనికెళ్ళ సూర్యమీనాక్షి, ప్రముఖ నటులు ఎ.వినోద్‌కుమార్, కళాదర్బార్ సంస్థ అధినేత పొత్తూరి రంగారావు, జాతీయ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్‌వి.చెన్నారావు, పి.కోటేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత భారతి పురస్కారాలను అంతర్జాతీయ గాయని మణిశాస్త్రి, సింగింగ్ స్టార్ విజయలక్ష్మి, నంది అవార్డుగ్రహీత సురేఖామూర్తి, రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ అధినేత్రి ఎంవి.రమణకుమారి, శైలజ, వర్ధమాన గాయని సాయిమేఘన తదితరులకు అందుకున్నారు. కార్యక్రమానికి ముందు 'వివాహ భోజనంబు మాధవపెద్ది వంటకంబు' పేరుతో మాధవపెద్ది పాటల పల్లకీ మహోత్సవ కార్యక్రమం చింతలపాటి సురేశ్-మణిశాస్త్రి స్వరసారధ్యంలో అద్భుతంగా సాగింది. ఈ సంగీతానికి కీబోర్డుపై వినోద్‌బాబు, రాజు, రాజేశ్, తబలపై కె.శివశంకర్, సాయిచరణ్, ప్యాడ్స్‌పై సతీష్, డ్రమ్స్‌పై శ్రీనివాస్‌మూర్తి వాద్యసహకారాన్ని అందించారు. మనస్విని అవ్వారి కూచిపూడి నృత్యం అద్భుతంగా సాగింది. వక్తలు మాట్లాడుతూ కళాకారులు అమరులు అని, చిరంజీవులు అని, మన మాధవపెద్ది సత్యం చిరంజీవి, లోకంలో ఉన్నంత కాలం చిరంజీవులుగా ఉంటారన్నారు. పదిలక్షల గొంతుల్లో విలక్షణమైన గొంతు మాధవపెద్ది సత్యం గారిదేనని అన్నారు.

## జానపద కళారూపాల్లోనూ కవిత్వం : డా. నందిని సిద్ధారెడ్డి

రవీంద్రభారతి, డిసెంబరు 18 ప్రభాతవార్త : జానపద కళారూపాల్లోనూ కవిత్వం ఉంటుందని ఒగ్గుకథలోని కొన్ని పంక్తులను ఉటంకించిన తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి మారుతున్న కాలానికి అనుగుణంగా సమకాలీన జీవితాన్ని సరైన దృక్పథం నుండి చిత్రించిందే మంచి కవిత్వం అవుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన వచన కవిత్వ అధ్యయన శిబిరంలో సిధారెడ్డి ప్రదానోపన్యాసం కావిస్తూ కవిత్వానికి అధ్యయనం ప్రాణమని, అధ్యయనం లేకుంటే కవిత్వానికి పరిపూర్ణలేదని, కవికి ఉత్సాహం, ఎంచుకున్న అంశంపై అంకితభావం చాలా ముఖ్యమని సూచించారు. పాత మార్గంలో కాకుండా నూతనమార్గం చూపేదే నిజమైన కవిత్వమని విశదీకరించారు. ఈ శిబిరంలో ప్రముఖ కవులు, విమర్శకులు తమ ప్రసంగాల్లో యువత కవిత్వం వైపు మళ్లాలని ఆకాంక్షించారు. ఆచార్య శివారెడ్డి అధ్యక్షో పన్యాసంలో తరాలు మారుతున్న కొద్దీ కవిమార్గం కూడా తదనుగుణంగా మారాలని, కవిత్వాన్ని అనుభవాల సాగరం నుండి చేదుకోవాలని సూచించారు. కవిత్వానికి ప్రేరణ, సాధన చాలా ముఖ్యమని, భారతీయ సాహిత్యం లో ఆదికవి వాల్మీకి శోకం నుండి శ్లోకాన్ని సృష్టించారని డా. కాంచనపల్లి గోవర్ధనరాజు అన్నారు. డా. యాకూబ్ కవిత్వానికి భాష చాలా ముఖ్యమని, భాషవల్లే కవిత్వానికి అస్తిత్వం కలుగుతుందని, వడకట్టిన పదాల సమాహారమే కవిత్వమని చమత్కరించారు. డా. వసునూరి రవీందర్ మాట్లాడుతూ దృక్పథంలేని కవిత్వం చీకటిలో వేసిన బాణమవుతుందని, బాధితులపక్షం ఉంటేనే కవిత్వానికి సార్థకత అన్నారు.

చిత్తూరుతోసహా తెలంగాణలోని అనేక జిల్లాల నుండి ఈ శిబిరంలో పాల్గొన్న వారికి పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య స్వాగతం పలుకగా, కవి డా. మల్లెగోడ గంగాప్రసాద్ సమన్వయపరిచారు.

# సిఎంకు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి వినతి


బాధితులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి డిసెంబరు18,ప్రభాతవార్త
వక్ఫ్ బోర్డు సి.ఈ. ఓ ఇటీవల వక్ఫ్ భూముల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేయాలని, వంద సర్వే నెంబర్లతో కూడిన నిషేధిత జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో ప్రజలు ,మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి నిషేధిత జాబితాలో నుండి తమ కాలనీలు,బస్తీలకు చెందిన సర్వే నంబర్లను తొలగించాలని ఎంతో కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇండ్లు కట్టుకున్నామని, తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరగా... వక్ఫ్ బోర్డు ప్రకటించిన జాబితాలోని బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పేదల పక్షాన నిలబడతానని ఎమ్మెల్యే మాటిచ్చారు, మల్కాజిగిరి నియోజకవర్గంలో 382 ఎకరాల విస్తీర్ణంలో 100 సర్వే నెంబర్లను వక్ఫ్ బోర్డు కు చెందినదిగా ప్రకటించగా, దీనిలో 70 కాలనీలు,బస్తీలు, దాదాపు 30 ఏళ్ల క్రితమే ఏర్పడ్డాయి, 1,967 కుటుంబాలు , దాదాపు ఒక లక్ష జనాభా ఉన్నారని, ఇప్పుడు రిజిస్ట్రేషన్ల నిలిపివేస్తే పేద ప్రజల అవసరానికి ఆడపిల్లల పెళ్లిళ్ల సమయానికో , పైచదువుల కోసమో ఇండ్లను అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా, రిజిస్ట్రేషన్లు జరగకపోతే ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందని, పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ బోర్డు ప్రకటించిన నిషేధిత జాబితాలో నుండి పేద ప్రజల ఇండ్లను తొలగించాలని, అదేవిధంగా గౌతమ్ నగర్ డివిజన్ ప్రజల దాహార్తి తీర్చేందుకు 5 ఎంఎల్ రిజర్వాయర్ ను నిర్మించాలని ,మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని చెరువుల పరిరక్షణ మరియు సుధరీకరణ కోరుతూ ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. వినతి పత్రం అందజేశారు.

### సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి : ఎస్.హెచ్.ఓ ఉపేందర్ రావు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపేందర్ రావు

కొంపల్లి, డిసెంబర్ 18, ప్రభాతవార్త
సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబీకులు, బంధువులు, తెలిసిన వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్.హెచ్.ఓ ఉపేందర్ రావు సూచించారు. బుధవారం బాచుపల్లి వివిఎస్ఆర్ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యార్థులకు బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ ఉపేందర్ రావు ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవేర్ నెస్ ప్రోగ్రాం గురించి సైబర్ క్రైమ్ సిబ్బంది, సబ్ ఇన్స్పెక్టర్లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రావు మాట్లాడుతూ తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు దయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఎస్ఆర్ కాలేజ్ మేనేజ్మెంట్‌తో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

### భక్తిపారవశ్యం మహిషాసురమర్దని పౌరాణిక పద్యనాటకం


భగవద్గీత పారాయణం కావించిన చిన్నారి కళాకారులతో అతిథులు

రవీంద్రభారతి, డిసెంబరు 18 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్యల సౌజన్యంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ పదిహేనవ వార్షికోత్సవ సంబరాలను పురస్కరించుకొని నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో తొమ్మిది రోజులపాటు జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పద్యనాటక పోటీల్లో 6వరోజు నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ వారిచే తాండ్ర సుబ్రహ్మణ్యం రచన, ఎం.అర్జునరావు దర్శకత్వంలో రూపొందిన మహిషాసురమర్దని పౌరాణిక పద్యనాటకం, మెదక్ జిల్లా బండ పోతగల్లు గ్రామానికి చెందిన భగవద్గీత భజన మండలికి చెందిన 18మంది చిన్నారుల భక్తిపారవశ్యంతో గీతాపారాయణం ఆధ్యాత్మిక పరిమళాలను గుభాళింపజేసి ఆహుతులను భక్తిమార్గంలో పయనింపజేశాయి. ఈ కార్యక్రమంలో నేమాని కృష్ణ,సంతోష్,నిర్వాహకుడు బాపనపల్లి పరమేశ్వర్, సలహాదారు శివనారాయణ తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేటర్ పర్యటన


వెంగళరావునగర్‌లో హైడ్రా అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పోరేటర్ దేదిప్యవిజయ్‌కుమార్.

యూసుఫ్‌గూడ, డిసెంబరు 18, ప్రభాతవార్త :
వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కాళీ స్థలాలను పరిరక్షించే దిశగా సమస్యలను పరిష్కరించేందుకు గాను హైడ్రా అధికారులతో కలిసి స్థానిక కార్పోరేటర్ దేదిప్యవిజయ్‌కుమార్ పర్యటించారు. డివిజన్ పలు రకాల సమస్యలను వారి దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా జానకమ్మ తోట 13ఎకరాల స్థలంలో అక్రమంగా వాహనాలను నిలపడంతో పాటు ఇసుక వ్యాపారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్కూల్ బస్సులు, కాలేజి బస్సులు, పార్కింగ్ చేయడంతో వారి వద్ద నుంచి కొందరు ప్రవేటు వ్యక్తులు లక్షల్లో వసూళ్ళు చేస్తున్నట్లు వారి దృష్టికి వచ్చింది. ఆ స్థలం అంతా యుఎల్‌సిలో ఉండటంతో ఎలాంటి కార్యకలాపాలు సాధించకూడదని ఆస్థలాన్ని మొత్తాన్ని అధికారుల స్వాధీనంలో ఉంచుకునేలా చూడాలన్నారు.అదేవిధంగా నిమ్స్‌మే ఎదురుగా 375గజాల స్థలం ఖాళీగా ఉందని ప్రజా ఉపయోగాలకు వినియోగించుకునేలా చూడాలన్నారు. మధురానగర్‌లోని ఇ బ్లాక్‌లో దాదాపు 400 గంజాల స్థలం ఓ వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని వెంటనే ఆస్థలాన్ని స్వాధీన పరుచుకోవాలని అధికారులకు సూచించారు. యూసుఫ్ గూడ చౌరస్తానుంచి రహ్మత్‌నగర్‌కు వెళ్ళే ప్రధాన రహదారి వెడల్పు పనులు చేపట్టాలని కోరారు. ఈసమస్యలన్నింటిని హైడ్రా కమీషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్ళి సత్వరమే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ సుధ, హైడ్రా ఏయి సుజిత్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ పాపయయ్య, తహాశీల్దార్ హైడ్రా విజయ్ కుమార్, డిప్యూటి సిటీ ప్లానర్ రామ్‌రెడ్డి,నాయకులు విజయ్‌ముదిరాజ్ తదితరులు పాలొనగన్నారు.

### చలో రాజ్‌భవన్‌కు తరలిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేతలు


రాజ్‌భవన్ వద్ద ధర్నాలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్, ఉరిటి వెంకట్రావు తదితరులు

శేరిలింగంపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త
అమెరికాలో గౌతమ్ ఆదానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలు, మణిపూర్‌లో వరుసగా జరిగిన అల్లర్లు,విధ్వంసాల అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజక వర్గం నుంచి నాయకులు, డివిజన్ కార్యకర్త_లు, కాంగ్రెస్‌పార్టీ అభిమానులు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు భారీగా తరలివెళ్లారు. రాజ్‌భవన్ వరకు చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎంపిలు,ఎమెల్సీలు, సీనియర్ నాయకులతో పాటు శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు ఉరిటి వెంకట్రావు,శేఖర్,గఫూర్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కృతజ్ఞతా సభ నేపథ్యంలో పలువురిని అదుపులోకి తీసుకున్న ఒ.యూ పోలీసులు


పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు

తార్నాక, డిసెంబర్ 18 ప్రభాతవార్త: కాంగ్రెస్ నాయకులు ఒ.యూలో చేపట్టిన కృతజ్ఞతా సభ నేపథ్యంలో పలువురిని ఒ.యూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సభను అడ్డుకుంటామని బీఆర్ఎస్వీ నాయకు ముందుగానే హెచ్చరించిన క్రమంలో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒ.యూలో బుధవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చేపట్టిన కృతజ్ఞతా సభ కారణంగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు అని చెప్పి ఎ మోకం పెట్టుకొని ఒ.యూలో నిరుద్యోగ కృతజ్ఞత సభ పెట్టారని ఎద్దేవ చేశారు. కేవల సంవత్సర కాలంలో 6 వేల ఉద్యోగాలు ఇచ్చి ధాని కోసం నిరుద్యోగ సభ పెడుతున్నారా ?, నిరుద్యోగ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు వేసే వరకు బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు అనిల్ ,జంగయ్య ,బొల్లు నాగరాజ్ యాదవ్, ప్రశాంత్, అశోక్ ,శ్రీనునాయక్,మిథున్,నాగేందర్ ,అవినాష్ ,సందీప్ ,సాయితదితరులు పాల్గొన్నారు.

### ఇంటీరియర్ ప్లాంట్స్ గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి

జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు

హైదరాబాద్, డిసెంబర్ 18, ప్రభాతవార్త: ఇంటీరియర్ ప్లాంట్స్ మన ఇంటికి అందాన్ని ఇవ్వటమే కాకుండా గాలి నాణ్యతను కూడా మెరుగుపరుస్తాయని జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జీవీఆర్ కరాటే అకాడమీలో విద్యార్థులకు ఇంటీరియర్ ప్లాంట్స్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాల్లో మరియు పరిసర ప్రాంతాలలో ఇంటీరియర్ ప్లాంట్స్ ప్రాముఖ్యతను తెలియచేశారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు అందంగా మొక్కలను అలంకరించారు. అనంతరం జి.ఎస్.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటీరియర్ ప్లాంట్స్ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించటంతో పాటు మానసిక వత్తిడిని తగ్గించటంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను ప్రకృతి ప్రధానంగా ఉంచుకోవటానికి ఇంటీరియర్ ప్లాంట్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, కరాటే మాస్టర్లు అమృతరెడ్డి, గణసంతోషినిరెడ్డి, అనగ, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

### టిజిఎస్‌పిడిసిఎల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



హైదరాబాద్, డిసెంబరు 18,ప్రభాతవార్త:
టిజిఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఉద్యోగులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి కేక్ కట్ చేసి, వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పాస్టర్ జోసెఫ్ ఎడ్వర్డ్, ఇన్‌చార్జి డైరెక్టర్లు సాయి బాబా, సుధా మాధురి, చీఫ్ ఇంజినీర్లు రంగ్‌నాథ్ రాయ్, నరసింహ స్వామి, శివాజీ, బాల స్వామి, భాస్కర్, సిజిఆర్ఎఫ్ మెంబెర్స్ లలిత, కె.శోభ రాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయడిని కలిసిన నలంద ఛైర్మన్


కేంద్ర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని మర్యాద పూర్వకంగా కలిసిన నలంద విద్యాసంస్థల ఛైర్మన్ మంతెన శ్రీనువాసరాజ.

యూసుఫ్‌గూడ, డిసెంబరు 18, ప్రభాతవార్త :
కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును, నిజామాబాదు ఎంపీ ధర్మపురం అరవింద్‌తో కలిసి బుధవారం నలంద విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనువాస రాజులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి వారిని అభినందించారు.కేంద్రమంత్రిగా రెండు తెలుగు రాష్ట్రాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ రాజకీయంగా ఎంతో చురుకుగా ముందుకు వెలుతున్న రామ్మోహన్ నాయుడు అందరికి ఆదర్శంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. అనంతరం శాలువతో పూల బొకెతో మంత్రిని ఘనంగా సన్మానించారు.

## టిడిపి నేత అంజయ్య మృతి

కంటోన్మెంట్,డిసెంబర్18ప్రభాతవార్త:
కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ రైల్ నిలయం అంబేడ్కర్ నగర్ బస్తీ పౌండర్ అధ్యక్షులు, తెలుగు దేశం పార్టీ బీసీసెల్ నగర్ కార్యదర్శి ఎన్.అంజయ్య ముదిరాజ్ 73, బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సికింద్రాబాద్ విజయ హెల్త్‌కేర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 1983 టీడీపి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేశాడు. రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో నివాసంఉంటున్న 340 మంది లబ్దిదారులకు 1986లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు పంపిణీ చేయించడంలో అంజయ్య కీలకపాత్ర పోషించారు. నాటి నేటి వరకు టీడిపిలో పనిచేస్తూ బస్తీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయన మృతి చెందడంతో మారేడ్‌పల్లి, అంబేద్కర్‌నగర్, టీచర్స్‌కాలనీ పరిసర ప్రాంతాలు విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య అంబిక, కూతురు రాజేశ్వరి ఇద్దరు కుమారుల శివ,శ్రీనివాస్ ముదిరాజ్‌లు ఉన్నారు. అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

### అంజయ్య సేవలు మరువలేనివి : నర్సింగ్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపిలో పనిచేస్తూ బస్తీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతూ వందలాది మందికి నిలువ నీడ కల్పించిన అంజయ్య సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన టీడీపి నాయకులు జె.నర్సింగ్ రావ్ తెలిపారు. ఎన్.అంజయ్య ముదిరాజ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపి నాయకులు జె.నర్సింగ్ రావ్,కె.ప్రతాప్, మధుసూదన్‌లు ఆయన బౌతికాయంపై టీడీపి జెండా, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదే విధంగా మారేడ్‌పల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటికాయల యేసుసు రత్నం, ఆర్.డి.నాగేశ్ యాదవ్, డి.బాబురావ్, పి.నర్సింగ్‌రావ్‌లు అంజయ్య బౌతికాయంపై పుష్పగుచ్ఛాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



హైదరాబాద్ డిసెంబరు18,ప్రభాతవార్త :
నల్లకుంట ఎస్‌బిఐ లైన్ విధిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు,గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో మహ పడిపూజ వైభవం జరిగింది.అంతకుండు సన్నిదానంలో జరిగిన పూజ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్డి రాంబాబు,పులి జగన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్ని అయ్యప్ప స్వామి ఆశిస్సులు తీసుకున్నారు. అత్రైయ్య గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన మహాపడిపూజను గురుస్వాములు దూసరి వెంకటేష్ గౌడ్,దూసరి శ్రీనివాస్ గౌడ్,దూసరి మహేష్ గౌడ్‌లు కొనసాగించారు.

## సీతాఫల్‌మండి నుండి బైక్‌ర్యాలీ


ర్యాలీగా వెళుతున్న ఆదం సంతోష్‌కుమార్ తదితరులు

సికింద్రాబాద్, డిసెంబర్ 18 ప్రభాతవార్త: అదానిపై, మణిపూర్‌పై మీడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నెక్లెస్ రోడ్ నుండి రాజ్‌భవన్ వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ర్యాలీలో పాల్గొనేందుకు సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సీతాఫల్‌మండి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ వందలాది మందితో సాగి నెక్లెస్ రోడ్డుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న జంపనప్రతాప్



3వ వార్డు మడ్‌పోర్టులో అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 18 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వాములు మాల ధరించి కఠిన దీక్షతో పూజలు చేసి ఇరుముడి కట్టుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకొని విజయవంతంగా రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బుధవారం 3వ వార్డు మట్‌పోర్ట్ ఆవరణలో యాదగిరి గురుస్వామి ఆఆధ్వర్యంలో 29వ అయ్యప్ప మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి జంపన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సి.నర్సింగ్, శివ, రాము, డి.నర్సింగ్, కన్నె, కత్తి,గద, గంట ఇతర స్వాములు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలి : సిఆర్‌పిఎఫ్



సికింద్రాబాద్ సిడిపిఓకు వినతిపత్రం అందజేస్తున్న బాలలహక్కుల పరిరక్షణ వేదిక

**అడ్డగుట్ట డిసెంబర్18ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడి కేంద్రాలలో మంచినీరు, విద్యుత్,టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు తమ విధులకు హాజరు కావడం లేదని సి.ఆర్.పి.ఎఫ్, తల్లుల సంఘం ప్రతినిధులు బుధవారం సికింద్రాబాద్ సి.డి.పి.ఓ. డాక్టర్ స్వప్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సి.డి.పి.ఓ. ప్రతినిధులు మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లో తల్లులకు, పిల్లలకు వచ్చే బాలామృతం, గ్రుడ్లు వంటి వస్తువులు సకాలంలో అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జి.భాగ్యలక్ష్మి, రమాదేవి, ప్రవీన్, యువరత్న, సంతోష్, సువర్ణ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలన్నింటినీ పూర్తి చేశాం : నాగపూర్ణ శ్రీనివాస్

- మంచిరేవులలో రూ.30.లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

**నార్సింగి, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతీ హామీని పూర్తి చేశామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని మంచిరేవుల ఎస్సీ కాలనీలో రూ.30. లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగపూర్ణ మాట్లాడుతూ చెప్పింది చేయడం, చేసేదే చెప్పడం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా మంచినీరు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు, పార్కులు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కమ్యూనిటీహాళ్లు ఇలా అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మేలు కోసం అనేక సంక్షేమ పతకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు సౌకర్యం, జీరో కరెంటు బిల్లు, రూ.500.కే సిలిండర్ ఇలా అనేక పతకాలు అమలు చేసిందని, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లంల పద్మ వీరారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి లంకల పాపిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు దొబ్బ లక్ష్మణ్, క్రాంతి, శ్రీనివాస్, రాజు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

**సైఫాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అప్పటి వరకు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పే స్కేల్‌ను అమలు చేయాలని సంఘం నాయకులు కోరారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం 19,600 మంది ఉద్యోగులు గత 18 సంవత్సరాల నుంచి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, పది లక్షల ఉద్యోగ బీమా, పది లక్షలు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, పదవి విరమణ చేసిన తరువాత 25 లక్షల రూపాయలు బెనిఫిట్ కింద చెల్లించాలని కోరారు. సిఎం రేవంత్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తాము చేస్తున్న ధర్నా శిభిరానికి వచ్చి మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోగా తమ డిమాండ్లను అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని సిఎం నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు దుర్గం శ్రీనివాస్, పడాల రవీందర్, సరిత, సురేందర్ సహదేవ్ పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్



క్రీడా పోటిలు నిర్వహించిన టిఎన్‌జిఓ క్రీడాకారులు

**బేగంబజార్,డిసెంబర్ 18ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆద్వర్యంలో చేపట్టిన స్వామినాథమ్ క్రీడా పోటిలు గగహన్ మహల్ మైదానంలో రెండవ రోజు కొనసాగాయి.రెండవ రోజు జరిగిన క్రికెట్‌పోటిలో ఐ,జి రిజిస్ట్రేషన్, హైదరాబాద్ యూత్ ఫోర్స్,స్టాంప్స్,రిజిస్ట్రేషన్,సెంట్రల్ లేబ్రరి, విద్యా శాఖ,ఎక్సైజ్ ప్రొహిబిషన్ జట్టులకు జరిగిన పోటిలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ప్రారంభించారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్,కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,గజిటెడ్ ఉద్యోగుల హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణాయాదవ్,ప్రతినిధులు బి.శంకర్,కె.శ్రీనివాస్,ముకీం ఖురేషీ,ముస్తాఫా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప నామస్మరణతో దద్దరిల్లిన వివేకానందనగర్

**నార్సింగి, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** కలియుగ దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప నామస్మరణంతో వివేకానందనగర్ కాలనీ దద్దరిల్లిపోయింది. మైసమ్మ, పోచమ్మ దేవాలయాలలో వేణు గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములంతా ఇరుముడులు కట్టుకొన్నారు. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు అయ్యప్ప స్వామిని స్తుతిస్తూ సాగిన భక్తిగీతాలతో స్థానికులు భక్తిసాగరంలో మునిగితేలారు. ఈ సందర్భంగా వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ గొల్ల స్వరూప నాగేష్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనలోని చెడును తొలగించి మంచి మార్గంలోకి తీసుకెళ్లేందుకు అయ్యప్ప దీక్ష ఉపకరిస్తుందన్నారు. మాల ధారులంతా చన్నీటి స్నానం చేస్తూ, అనుక్షణం అయ్యప్ప స్వామి నామ జపాన్ని చేస్తూ, కటిక నేలపై పవళిస్తూ సజ్జన సాంగత్యం చేస్తారన్నారు. మాల ధరించినప్పుడు పాటించిన మంచి నియమాలను మాల తీసిన తరువాత కూడా పాటిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటామని, అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకుంటామన్నారు. భక్తి మార్గంలోకి యువతరం పెద్ద ఎత్తున వస్తుండడం శుభ పరిణామమన్నారు. ప్రతీ ఒక్కరూ మన సనాతన ధర్మంను ఆచరించాలని, మన బిడ్డలకు మన ధర్మం గురించి తెలుపాలని, దేవాలయాలకు తీసుకెళ్లాలని సూచించారు. మనమతంను మరం ఎంత శ్రద్ధగా ఆచరిస్తామో అలాగే పరమత సహనంను కూడా కలిగి ఉండాలని, అప్పుడే సోదర సౌభాతృత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత దారుగుపల్లి యాదగిరి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి ఆకుల తిరుపతయ్యతో పాటు మరో ఐదుగురు స్వాములు ఇరుముడులతో శబరిమలకు తరళి వెళ్లారు. వివేకానంద నగర్ కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున ఈ వేడుకలో పాల్గొని స్వామి శరణం, అయ్యప్ప శరణం అంటే నినదించారు.



గౌలిదొడ్డిలోని వివేకానందనగర్ కాలనీ నుంచి ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాముల దృశ్యం

## నాణ్యమైన రుచికరమైన వంటకాలతో గిరాకీ పెరుగుతుంది : కొంతం దీపిక



కుమ్మరిగూడలో గంగపుత్ర మహిళల చేపలు, రొయ్యల శిక్షణలో పాల్గొన్న కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్18ప్రభాతవార్త:** ఆహార పదార్థాల్లో నాణ్యత, రుచికరంగా ఉంటేనే గిరాకి పెరుగుతుందని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. పిఎం.ఎం.ఎస్.వై. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ఆధ్వ ర్యంలో సికింద్రాబాద్ కుమ్మరిగూడ గంగపుత్ర సంఘంలో మహిళలు నిర్వహించిన చేపలు, రొయ్యల వంటకాల శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కుల వృత్తిదారులకు ప్రధాన మంత్రి యోజన పథకం కింద కుల వృత్తిదారులు అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుం దన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

**మినీ క్రిస్మస్ వేడుకల్లో కార్పోరేటర్ కొంతం దీపిక . . .**

మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లోని సెయింట్ మేరీ స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకలకు మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడిపి సీనియర్ నాయకుడు గౌరి శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌టి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి నామినేషన్



నామినేషన్ పాత్రలను సమర్పిస్తున్న వి. శ్రీనివాస్ రెడ్డి

**చిక్కడపల్లి డిసెంబరు 18 ప్రభాతవార్త:** విఎస్‌టి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్ ఎన్ రెడ్డి గ్రూప్ తరపున అధ్యక్షులుగా వి శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుత అధ్యక్షులు నామినేషన్ పాత్రలను దాఖలు చేసారు. అంతకు ముందు బుధవారం బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయంలో , నాగమయ్యకుంట కట్ట మైసమ్మ దేవాలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి కార్మిక శాఖ అధికారులను పత్రాలను సమర్పించారు. సంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్‌కు నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కార్మికులను ద్వేషించి మాట్లాడుతూ కార్మికులు అందుబాటులో ఉంటూ కనీస వేతనాలు అమలు చేయడంలో కార్మిక సమస్యలపై పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. మంచి వేతన ఒప్పందాన్ని అందించడం జరిగిందని, రాష్ట్రంలో ఏ కంపెనీలో నియామకాలు లేవని, తాను 2016లో అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత 200 మందిని కొత్త నియమించుకోవడంతో పాటు కార్మికుల పిల్లలకు కూడా ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఇంక్రిమెంట్‌లను వచ్చే జూన్, జులై మాసాలలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. తను ఆరవ సారి పోటీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ ప్రధాన కార్యదర్శి ఐలీ ప్రభాకర్, బాబి, రవి యాదవ్, శంకర్, మధుసూదన్, సత్య నారాయణ, రాములు, లతీక్, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖకోహినూర్" కవితా సంపుటి ఆవిష్కరణ

**చిక్కడపల్లి డిసెంబర్ 18 (ప్రభాతవార్త):** విమల సాహితి సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ జెల్ది విద్యాధర్ రావు రచించిన 'కోహినూర్' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సిటీ కల్చరల్ సెంటర్ లో 22 న జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, సభకు ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత ఆచార్య శిఖామణి ,తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాకేశ్వరం శంకరం, ప్రముఖ కవయిత్రి శైలజామిత్ర, కోహినివంజారి, కుసుమ ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, ప్రముఖ కవి పెద్దురి వెంకట దాసు తదితరులు పాల్గొంటారని జెల్ది విద్యాధర్ రావు వివరించారు.

## తుకారాంగేట్‌లో తల్లి,కొడుకుల అదృశ్యం

**కంటోన్మెంట్,డిసెంబర్ 18 ప్రభాతవార్త:** భార్య,భర్తలు గొడవతో తలెత్తిన వివాదంతో కుమారుడిని తీసుకొని ఓ మహిళా ఇంట్లో నుంచి బయటకువెళ్లిన సంఘటన తుకారాంగేట్ పోలీసస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం తుకారాంగేట్ చౌరస్తా సమీపంలో నివాసం ఉంటున్న సుభాష్, అతని సోదరుడు ప్రకాశ్ పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. ఇంటి అస్థి విషయంలో గొడవపడుతుండగా సంగీత తన భర్తతో గొడవపడి ఈ నెల 15వ తేదీన సంగీత తన కుమారు సిద్ధార్థ 13తో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎక్కడ వెతికిన ఆమె ఆచూకీ కనిపించకపోవడంతో భర్త సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కిరణ్ కుమార్ మిసి్ంగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యమకారులను ప్రభుత్వం అదుకోవాలి

**సైఫాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కారులను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వ పథకాలలో వాటా కల్పించాలని తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షల వేదిక డిమాండ్ చేసింది. ఉద్యమ కారులను గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కమిటీని వేయాలని వేదిక చైర్మన్ డి.కుమార స్వామి, మహిళా విభాగం కన్వీనర్ దోనేటి కృష్ణలత, కన్వీనర్ గోల్లపల్లి నాగరాజు, రవీందర్, సంపత్‌కుమార్ తదితరులు కోరారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, కళాకారులను గుర్తించి భాషా సాంస్కృతిక సేవలో ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వం గుర్తించిన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమంలో విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే ఉద్యమ కారులపై ఉన్న కేసులను సంపూర్ణంగా ఎత్తివేయాలని, తెల్లరేషన్ కార్డును ఆధార్‌కార్డుకు అనుసంధానం చేయాలని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఉద్యమకారులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని, ఉద్యమానికి నాయకత్వం వహించి చనిపోయిన కుటుంబాలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు.

## పాత పద్ధతిలోనే ఎస్సీ రిజర్వేషన్‌లు అమలు చేయాలి

**సైఫాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** ఏజెన్సీ ప్రాంతంలో పాత పద్ధతి ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌లను అమలు చేయాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జెఎసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగిన ఎస్సీ రిజర్వేషన్లను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో తొలగించడంతో తమకు తీవ్రంగా అన్యాయం జరిగిందని జెఎసి ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మర శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ఎంతో వెనుకబడి ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఎస్సీలను ప్రభుత్వం అదుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఎస్సీ జనాభా పెరిగిందని, ఇందుకు అనుగుణంగా రిజర్వేషన్‌లు 20 శాతంకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమా వేశంలో ధన్‌రాజ్, కృపాకర్, రాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## హైదరబాద్ ఇంజనీర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా రాపోలు రవీందర్

**హైదరబాద్,డిసెంబరు 18,ప్రభాతవార్త:** ఎర్రమంజిల్ ఇంజనీర్ల భవన్ లో హైదరబాద్ ఇంజనీర్‌ల రాష్ట్ర నూతన సంఘం నూతన కార్యవర్గంను బుధవారం ఎన్నుకొన్నారు. నాలుగు వందల మంది ఇంజనీరు సంఘాల ప్రతినిధులు వివిధజిల్లాల నుంచివచ్చి ఎన్నికలలో పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడుగా రాపోలు రవీందర్, జనరల్ సెక్రటరీ గా చక్రధర్, గౌరవ అధ్యక్షులుగా ధర్మ, ట్రీజెరర్ గా ఎన్ ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా కె. రాజశేఖర్, రామకృష్ణ, ఆర్, సత్య నారాయణ గౌడ్, వి,విద్యుసుమన్, శ్రీనివాస్ గౌడ్, విజయ లక్ష్మి, అసోసియేట్ ప్రెసిడెంట్ లుగా డి.రమ, ఎం.కృష్ణ, చక్రపాణి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మొట్టమొదిసారిగా ఇంజనీర్లకి పదవి విరమణ అనంతరం ఎక్సటెన్షన్ లేకుండా చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేసినారు. ఉమ్మడి జిల్లాలైన మహబూబ్నగర్, నల్గొండ, హైదరబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లా ఇంజనీర్ లకి కూడా చీఫ్ ఇంజనీర్, ఇంజనీర్ ఇన్ చీఫ్ పోస్టుల్లో కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుతాన్ని నూతన కార్యవర్గం కోరింది. ఎలక్షన్ అధికారులుగా మహేందర్, వెంకటేశం, గోవర్ధన చారి , శ్యామ్ ప్రసాద్ రెడ్డి వ్యవహరించారు.

## సామాజిక సేవ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందజ



పి.ఇ.పి అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్తను కలిసి అఖిలా భారత శ్రీశైలం జాయింట్ సెక్రటరీ సి.అశోక్

**అఫ్జల్‌గంజ్, డిసెంబరు 18ప్రభాతవార్త:** సామాజిక సేవ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందజలో ఉండటం ఎంతో సంతోషదాయకమని ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త అన్నారు.అఖిలా భారత శ్రీశైలం, కాణిపాక క్షేత్ర ఆర్యవైశ్య నిత్యా అన్నదాన సత్రముల జాయింట్ సెక్రటరీగా పి.అశోక్ గుప్త నియమితులయ్యారు.మర్యాద పూర్వకంగా గౌలిగూడలోని ప్రజా ఏక్తాపార్టీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్తను కలిశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎల్లప్పుడు సామాజిక భాద్యత ఉంటూ ముందుకుసాగడం పట్ల ఆర్యవైశ్యులకే దక్కుతుందన్నారు .పుణ్యక్షేత్రాల ఆర్యవైశ్య నిత్యాన అన్నదాన సత్రాలకు వచ్చే వారికి అన్నదానం చేయడం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

## టిపిసిసి ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమం

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 18, ప్రభాతవార్త** ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆద్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి భారి ఎత్తున నాయకుల కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డితో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల మేడ్చల్ మల్కాజ్గిరి డి.సి.సి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, అవిజా జేమ్స్, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి ఎస్టీ సెల్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఐఎన్‌టియుసి నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

# న్యాయ విద్యార్థుల సదస్సు సన్నాహక సభ-పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్ధసారథి,భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య కన్వీనర్ హైదర్ అలీ

**చిక్కడపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** అఖిల భారత న్యాయవాదుల సంఘం, భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 21 న జరిగే రాష్ట్ర 2వ న్యాయ విద్యార్థుల సదస్సు సన్నాహక సభ బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి, భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య కన్వీనర్ హైదర్ అలీ మాట్లాడుతూ ఈ సదస్సును విజయవంతం చేయాలని న్యాయ విద్యార్థులకి పిలుపునిచ్చారు. యువ ప్రతిభను పెంపొందించాలని, న్యాయవిద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగ విలువలను, లౌకికత్తాత్వాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రత్రత్వాన్ని కాపాడుకోవాల్సిన రోజులొచ్చాయని వారు పేర్కొన్నారు. 21న 'పౌరసమాజం రాజ్యాంగం న్యాయ విద్యార్థుల పాత్ర' అనే అంశంపై జరిగే రాష్ట్ర సదస్సులో ప్రారంభ ఉపన్యాసం సంఘం ప్రధాన కార్యదర్శి, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సురేంద్రనాథ్, ప్రధాన వక్తగా జాతీయ జ్యూడిషల్ అకాడమీ మాజీ డైరెక్టర్, మాజీ నేషనల్ లా స్కూల్ పూర్వ వైస్ ఛాన్సెలర్ మోహన్ గోపాల్ తదితరులు హాజరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబెర్ సి. రామచంద్రారెడ్డి, నాయకులు క్రాంతి, రవితేజ, అనిల్ కుమార్, అశోక్ కుమార్, క్రాంతి, హుస్సేన్, వంశీ, సాయినాథ్, ముస్తఫా, సాయితేజ, అలిజాన్, తహీద్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార వ్యవస్థ బలోపేతం కోసం కృషి : మనాల మోహన్ రెడ్డి

**చిక్కడపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** సహకార వ్యవస్థ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ సహకార్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనాల మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సహకార యూనియన్ సర్వ సభ సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సహకార వ్యవస్థ ప్రమాదంలో ఉందని, సహకార సంఘాలతో కలిసి బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. సహకార వ్యవస్థకు ఎంతో చరిత ఉందని, 1925 సంవ్సతరం నుంచే ఈ వ్యవస్థ ఉందని తెలిపారు. సహకార యూనియన్ సహకార సంఘాల యొక్క ఉన్నతి కోసం పాటుపడే సంస్థ అని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా సహకార చట్టాలను, సహకార సంఘాల్లో చేసుకునే వ్యాపారాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ముందు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సహకారం యూనియన్ ఎండీ కెవిఎన్. అన్నపూర్ణ, నేషనల్ బ్యాంక్ ఫెడరేషన్ చైర్మన్ కే.రవీందర్ రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ ఎం.గంగారెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జె.రాఘవరెడ్డి, నల్గొండ, మెదక్, అదిలాబాద్ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌లు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ఇ.బోజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ సహకార్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనాల మోహన్ రెడ్డి

## ఛలో రాజ్ భవన్‌కు తరలిన చార్మినార్,బహదూర్‌పుర కాంగ్రెస్ నాయకులు



ఛల్లో రాజ్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్,బహదూర్‌పుర రియోజకరవ్గం కాంగ్రెస్ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్,డిసెంబరు 18 ప్రభాతవార్త :** భారత దేశ సంపదను ప్రధానమంత్రి గౌతం అదానికి దోచు పెడుతున్నారని,ప్రజలు ఈ విషయంలో మేల్కోవాలని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్ అన్నారు.ఏఐసిసి పిలుపు మేరకు బుధవారం టిపిసిసి అధ్యక్షులు ఎం.మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చార్మినార్,బహదూర్‌పుర నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఛతో రాజ్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి,గౌతం అదానిలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలలోను విఫలమైందని తెలియజేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఛలో రాజ్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్బిరు, మల్లిక, కృపారెడ్డి,అరుణ,రమాదేవి పలువురు పాల్గొన్నారు.

## 25వ తేదీలోగా నూతన బిజెపి బూత్ కమిటీలను పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న బిజెపి ముఖ్య నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి పార్టీ కార్యాలయంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నరసింహరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన బూత్ కమిటి సంస్థాగత ఎన్నికలలో రాష్ట్ర బిజెపి నాయకులు,ఎన్నికల ఇంఛార్జి ప్రేమేందర్ రెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నియోజ్యకవర్గం,మండలాలు, డివిజన్‌ల వారిగా బిజెపి క్రియాశీల సభ్యత్వంపై చర్చిండం జరిగిందని తెలిపారు.

కొత్త బూత్ కమిటీలను ఈ నెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం,శంకర్ రెడ్డి, ప్రభాకర్, మల్లారెడ్డి,కొమరయ్య,జోగి రవి,దేవేందర్ రెడ్డి, పాపయ్య గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా సిఎంఆర్‌ఎఫ్ : జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 18 ప్రభాతవార్త** నిరుపేదలకు,రోగగ్రస్తులకు,బాధితులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన బాధితులకు శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవ ర్గం హఫీజ్‌పేట్ డివిజన్ హుడాకాలనీకి చెందిన కరుణాకర్,ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్ టీఆర్ నగర్,ఎల్లమ్మబండకు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ లు అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన అనంతరం శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ద్వారా బాధితులకు 1లక్ష,20వేల రూపాయల సీయం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్బంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు, రోగులకు భరోసాగా ఉంటుందన్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కొంతమేరకు ఆర్థిక సహాయాన్ని అందించి వారిని ఆదుకునేందుకు సీఆర్ ఆర్‌ఎఫ్‌ద్వారా తమవంతు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి సిఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తున్న జగదీశ్వర్ గౌడ్


**IN THE COURT OF THE HON'BLE XXI ADDL. JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: AT: HYDERABAD**
**O.S.No. 5612 of 2024**

**Between:**
Rodda Indira And Others ...**Plaintiffs**
**And**
THE MANDAL REVENUE OFFICER
All Concerned ... **Defendants**

**NOTICE/SUMMONS**

To,
All concerned
Sir,
Please take notice/Summon that the plaintiffs herein filed the above suit against the Tahasildar Shaikpet Mandal, Hyderabad and All concerned for Declaration to Declare the plaintiffs as legal heirs of the Deceased father Late. Rodda Anandam died intestate on 21-09-2023. Therefore the general public are hereby informed that if anybody having objections in this regard, may appear before the said court on 03-01-2025 at 10-30 AM either in person or through an Advocate before the Hon'ble court otherwise the matter will be decided in your absence as exparty.
**(BY ORDER OF THE COURT)**
**S. MALLA REDDY**
AMRREN FATHIMA
ADVOCATE FOR PLAINTIFFS
**Phone: 9394766532 [cell]**
**(COUNSEL FOR THE PLAINTIFFS)**

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM VI M.M (UPPAL) MEDCHEL-MALKAJGIRI DISTRICT AT : L.B.NAGAR**
**O.S.NO. 839 OF 2024**
**BETWEEN :-**
1. Aalla Mounika, W/o Late. Narsimha Reddy, Aged about 34 years.
2. Aalla Ruthwik Reddy, S/o. Late. Narsimha Reddy, Aged about 11 years.
3. Aalla Varshitha, D/o. Late. Narsimha Reddy, Aged about 10 years, Plaintiffs No 2 and 3 are minors and they are under the guardainship of the natural mother/guardian, the Plaintiff No.1 here in and all are R/o Bahupeta village Mandal: Tadagirigutta, Dist. Yadadri-Bhongir presently residing at P.No.656/A, NRR Puram, Yousufguda, Hyderabad.
...**Plaintiffs**
**AND**
1. The Tahasildhar Medipally
2. To whom so ever it may concern
...**Defendants**
To,
To whom so ever it may concern
...**Defendant No.2**
Please take notice that the above named Plaintiffs filed the above suit against the Defendants for Declaration of Legal Heir and successor of Deceased Late. Aalla Narsimha Reddy, in respect of the suit schedule property, All that the open plot bearing No.310 admeasuring 110 Sq.Yards in Sy.No.114, 118, 120 & 121 situated at "KRANTI COLONY" Chengicherla Village, Under Boduppal Municipality, Medipally Mandal, Dist. Medchal-Malkajgiri with in the following boundaries:- North: Plot No.309, South : 25' Wide Road, East: Neighbour's Land, West : Plot No 310 part, The same is posted to 26.12.2024 for your appearance. If any of you have any objections, claim, title or interest over the suit schedule property you may appear before the above mentioned court on 26-12-2024 at 10.30 a.m. either in person or through an Advocate, otherwise the Hon'ble Court will proceed with the matter in your absence.
**// BY ORDER OF THE COURT //**
**JUKANTI RAVINDAR**
**S.MADHAVI**
Advocates
H.No: 7-84/6/1, Shanker Nagar, Peerzadiguda, Uppal, Medchal-Malkajgiri Dist
**Cell No: 9848511755**

**IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE-CUM-ADDITIONAL CHIEF JUDICIAL MAGISTRATE, MEDICHAL MALKAJGIRI DISTRICT AT: MALKAJGIRI**
**S.O. No. 417 of 2024**
BETWEEN :
1. **Davalla Ushabai,** S/o. Late. Davalla Narsimha, Aged about 71 years, Occ: Housewife.
2. **Kasipally Sangeetha,** W/o. Kasipally Ravinder, D/o. Late. Davalla Narsimha, Aged about 46 Years, Occ: Housewife.
3. **Davalla Ravi Kumar,** S/o. Late. Davalla Narsimha, Aged about 42 Years, Occ: Pvt., Employee, All are R/o. H.No.1-7-43/49, Mahesh Nagar, Opp: Jyothi Apartments, Kapra, Hyderabad-5000 62, Telangana State.
...**PLAINTIFFS**
And
1. **The Mandal Revenue Officer,** Kapra Mandal, Medchal Malkajgiri Dist., Telangana State.
2. **All Concerned ....RESPONDENTS**
Where as the above named Petitioners/Plaintiffs are filled the above said case to Declare the Petitioners/ Plaintiffs are the Successors and only Legal Heirs of Deceased Late. Davalla Narsimha, and the above matter is posted on **31.12.2024** for appearance R2 (All Concerned) of any persons for objections. The Hon'ble Court was pleased to direct to take out notice through Paper Publication. Hence take notice as the case is posted on **31.12.2024 at 10:30 A.M.** Kindly appear in persons or through your Counsel on the said date.
// BY ORDER OF THE COURT//
**Sd/- P. MALLIKARJUNA**
**M. RAVI KUMAR**
**Advocates**
H.No.45-364, Prasanth Nagar, Malkajgiri, Hyderabad-500040
**Ph.No.9848046152**

## దేశ ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం
### - వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



ఫ్లకార్డులతో ఆందోళన నిర్వహిస్తున్న కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 18, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతం ఆదానిపై అమెరికాలో వచ్చిన ఆరోపణలతో దేశ ప్రతిష్ట దెబ్బతినడం జరిగిందని, ఈ విషయం గురించి ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు, విధ్వాసాలతో అట్టుడికి పోతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు.కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆదాని అవకతవకలపై విచారణ చేపట్టాలి : చైర్మన్ వీరయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న చైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు

**మలక్ పేట ,డిసెంబరు 18, ప్రభాతవార్త:** ఆదానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలపై విచారణ చేపట్టాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. అదానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలు, మణిపూర్ లో జరుగుతున్న అల్లర్లు, విధ్వాంసాలపై ప్రధాని మోడీ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదానిపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు ,అవినీతి, మోసం తదితర ఆరోపణలతో దేశ ప్రతిష్ట దెబ్బ తిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ఉదాంతం పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ దేశంలో అంతర్భాగమనే సంగతిని ప్రధాని మోడీ విస్మరించడం జరిగిందని ఆరోపించారు. మణిపూర్ లో జరుగుతున్న అల్లర్లు ,విధ్వంసాలపై ప్రధాని మోడీ స్పందించకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయ నూతన క్యాలండర్ విడుదల



నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

**వనస్థలిపురం. డిసెంబరు.18.ప్రభాతవార్త.** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని అభివృద్ధి చెందాలని శ్రీ ఇందు, లయోల విద్యాసంస్థల చైర్మన్ రంగినేని వెంకట్ రావు పేర్కొన్నారు. వనస్థలిపురం సచివాలయ నగర్ లో గల శ్రీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆలయ నూతన సంవత్సర క్యాలండర్ ను ఆలయ కమిటీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి నిత్యం హోమం ,కళ్యాణం, అన్నదానం తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల తో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.వి.పాపారావు,సత్యనారాయణ,, శ్రీధర్,అశోక్ కుమార్,సాంబశివరావు, రామ లక్ష్మి,వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## నాచారం రెడ్డి స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని కార్పోరేటర్‌కు వినతి



కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్నన రెడ్డి సంఘం ప్రతినిధులు

**నాచారం, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** నాచారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను కలిసి నాచారం రెడ్డి స్మశాన వాటిక లో మిగిలిన సౌకర్యాలు కల్పించాలని గురువారం నాచారం రెడ్డి స్మశాన వాటిక లో వినతి పత్రాన్ని అందజేశారు. నాచారం రెడ్డి స్మశాన వాటిక లో ఇదివరకు సుమారు రూ. 10 లక్షల రూపాయల వ్యయంతో రోడ్లు వేయించడం జరిగింది. మిగిలిన అభివృద్ధి పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాచారం రెడ్డి సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి నమిలికొండ భూపాల్ రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షులు పోగుల వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, సలహాదారులు గజ్జల కృష్ణారెడ్డి, నడప శంకర్ రెడ్డి,ఎర్రము హనుమంత్ రెడ్డి,ఉపాధ్యక్షులు సురకంటి మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి మెతుకు శ్రీనివాస్ రెడ్డి, కార్య నిర్వాహక కార్యదర్శులు కీసర రామకృష్ణారెడ్డి, కార్యదర్శి ఇత్తేటి మధుసూదన్ రెడ్డి, పీసరి విష్ణువర్ధన్ రెడ్డి, నడప సందీప్ రెడ్డి ,మెట్టు ఉదయ్ కిరణ్ రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## పారుశుద్ధ్య కార్మికులకు రగ్గులు.... కాలనీ కోసం సిసి కెమెరాలను అందజేత

**నాచారం, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** పరిశుభ్రత కోసం నిరంతరం పనిచేస్తున్న పారుశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ వి.కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. నాచారం రవీంద్రనగర్‌లో క్లబ్ డిస్ట్రిక్ క్యాబినెట్ కార్యదర్శి గుంటుక శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సీసీకెమెరాలను, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణ ప్రసాద్, మహంకాళి ఆలయ చైర్మన్ కృష్ణా రెడ్డి, కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్‌కు సీసీ కెమెరాలు, 200 మందికి పారుశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను అందజేశారు. పేద పిల్లలకు విద్య, వైద్యం అందించేందుకు రూ. 9లక్షల వ్యయంతో ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. మొదట పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హబ్సిగూడ, నాచారం ఎలైట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ వైస్ గవర్నర్లు ఇన్నా రెడ్డి, కృష్ణారెడ్డి, జోన్ చైర్మన్ నంది కొండ శ్రీనివాస్ రెడ్డి, మీర్పేట్ క్లబ్ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముక్కు బండి టాక్స్‌లు వసూలు...పాతబస్తీకి నిధులు తరలిస్తున్నారు
## -బిజెపి కార్పొరేటర్ల ఆందోళన



జోనల్ కమిషనర్కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రజల వద్ద ముక్కు పిండి కోట్లాది రూపాయల టాక్స్‌లు వసూలు చేస్తున్న జిహెచ్ఎంసి నియోజకవర్గంలో అభివృద్ధికి నిధులు కేటాయించకుండా పాతబస్తీకి నిధులు తరలిస్తున్నారని కార్పొరేటర్లు ఆరోపించారు. కనీసం వీధుల్లో విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయాలని పరిస్థితిలో జిహెచ్ఎంసి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్లో పరిధిలోని కాలనీలలో గత ఆరు నెలలుగా నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి కార్పొరేటర్లు ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కార్పొరేటర్‌లు మాట్లాడుతూ ఎల్‌బినగర్ నుంచి టాక్స్‌లు వసూలు చేసి పాతబస్తీలకే నిధులు మళ్ళించారని ఎన్నో సార్లు కమిషనర్, మేయర్‌కి మొర పెట్టుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అధికారులపై ఒత్తిడి చేసి మళ్లీ పాత బస్తీకి నిధులు మళ్ళిస్తున్నారని ఆరంభించారు. పది నెలల నుండి కనీసం ఒక్క స్ట్రీట్‌లైట్లు లేదు, నూతన సీసీ రోడ్లు వేయలేదని తాము ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్ కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, చింతల అరుణ సురేందర్‌యాదవ్,బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగా నర్సింహాగుప్తా, ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్, కొప్పుల నరసింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, బిజెపి నాయకులు చింతల సురేందర్‌యాదవ్, పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ నేతలు

**ఉప్పల్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ బాలకృష్ణనగర్ కాలనీ అభివృద్దికి సిఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించారని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో బుధవారం బాలకృష్ణనగర్‌లో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇంచార్జీ ఎం.డి.రఫీక్, తవిడబోయిన గిరిబాబు, మల్లికార్జునస్వామి దేవాలయం చైర్మన్ నామ్ రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సందీప్, భాస్కర్, బిక్షపతిచారి, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రామంతాపూర్ భగాయత్ కాలనీ అభివృద్దికి సిఎం రేవంత్‌రెడ్డి రూ.71లక్షల నిధులు కేటాయించారని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు రుక్కయ్య యాదవ్, నరసింహా, సైదులు, శాంతి, సోమేష్, నాగరాజు, నాగమల్లయ్య, లక్ష్మణ్, సంధ్యారాణి, గాయత్రి, శోభ, అంబిక, ముత్యాల జంగయ్య, బాబు, తోట శంకర్, షకీల్, అశోక్,చింటూ,శాగశ్రీధర్,నాగమల్లయ్య,ఖాసీం పాల్గొన్నారు.

# జిల్లెలగూడ శ్రీవారి ఆలయ హుండీ ఆదాయం రూ.1,84,555లు



ఇఓలు, కార్పొరేటర్, మాజీ ధర్మకర్తల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతున్న దృశ్యం

**సరూర్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర ద్వారం ఉన్న అరుదైన ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ గ్రామంలోనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయం హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. ఆలయ వ్యవస్థాపక కుటుంబ ట్రస్టీ మెంబర్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ అనుమతి మేరకు దేవాలయ ఇఒ వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో పరిశీలకునిగా వచ్చిన దేవాదాయ ధర్మాదాయ శాఖ వికారాబాద్ డివిజన్ ఇఒ శ్రీనివాస్, స్థానిక జిల్లెలగూడ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వర్ తదితరుల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయ లెక్కింపు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులతో పాటు సిబ్బంది, శ్రీవారి సేవకులు హుండీల్లోని నగదును లెక్కించారు. ఈ నేపథ్యంలో గత సెప్టెంబర్ 11 నుండి డిసెంబర్ 18 వరకు మూడు నెలల ఏడు రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా మొత్తం రూ.1,84,555 లు వచ్చింది. అనంతరం ఆలయ రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేసి నగదు మొత్తాన్ని దేవాలయ ఖాతా ఉన్న జిల్లెలగూడ గాయత్రీనగర్ ఎస్‌బిఐ బ్యాంకులో జమ చేశారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్ ,కార్పొరేటర్ రామిడి కవితా రాంరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 26, 23, 20 డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక కార్పొరేటర్లు రామిడి కవితా రాంరెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అరవింద్ నగర్ కాలనీలో యుజిడి పనులను, వైష్ణవి కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులను, విద్యాటౌన్ షిప్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, నాయకులు పెద్దబావి సమరసింహారెడ్డి, గట్టు బాలకృష్ణ, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, బొల్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఛలో రాజ్‌భవన్ తరలిన మహేశ్వరం నియోజకవర్గ నేతలు



ఛలో రాజ్‌భవన్‌లో ప్ల కార్డు ప్రదర్శిస్తున్న టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ,చిత్రంతో సామిడి గోపాల్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడి పాలనలో దేశం పరువు తీసే విధంగా ఆదాని అమెరికాలో చేసిన ఆర్థిక అక్రమాలు, మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం మూలంగా చెలరేగుతున్న హింస, అల్లర్లను నిరసిస్తూ ఎఐసిసి ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని నెక్లెస్ రోడ్ నుండి సోమాజీగూడలోని రాజ్‌భవన్ వరకు తలపెట్టిన ప్రదర్శనకు మహేశ్వరం నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు తరలివెళ్ళారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాలాజీనగర్‌లో షాట్ సర్క్యూట్.. బాధితులకు మేయర్ పరామర్శ

**సరూర్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తన స్వంత డివిజన్ 31లోని బాలాజీనగర్ కాలనీలో షాట్ సర్క్యూట్ జరిగిన ముదిగొండ లక్ష్మి నివాసాన్ని బుధవారం స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె షాట్ సర్క్యూట్ వల్ల జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ నర్సింహరాజు, కార్పొరేటర్లు రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ, కొండ శ్రవణ్‌కుమార్ యాదవ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ శత వసంతాల ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కామ్రేడ్లు

**సరూర్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల అవిర్భావ దినోత్సవాన్ని పునస్కరించుకొని ఈ నెల 26వ తేదీన జరిగే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ బుధవారం మీర్‌పేట్ లెనిన్‌నగర్‌లోని బాలాపూర్ మండల సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్‌రెడ్డి, జరు ఏల శివనాయక్, పిచ్చిరాజు, రమావత్ చత్రు నాయక్, జఠావత్ రెడ్యా నాయక్, కేతావత్ శ్రీను నాయక్, దత్తు నాయక్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్సీ బొగ్గారపు



సభలో మాట్లాడుతున్న బొగ్గారపు దయానంద్‌గుప్తా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** ఆర్యవైశ్యుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయ మని ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా పేర్కొన్నారు. శాసన మండలి ప్రశ్నోత్తర సమయంలో ఎమ్మెల్సీ మాట్లా డుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైశ్యుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో వెంటనే బోర్డు సభ్యులను నియమించా లని, అదేవిధంగా అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్



క్రిస్మస్ కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ క్రీస్తు రూపాంతర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మినీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుందర్ నారాయణ, ఉపేందర్ సింగ్, కొత్త తిరుమల, సాయి, నరసింహ, పాస్టర్ జోన్‌పిటర్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో వైభావంగా అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్పను ఊరేగింపుగా తీసుకెళ్లుతున్న గొట్ల రాజు యాదవ్, శంకర్ యాదవ్ తధితరులు పాల్గొన్నారు.

**నేరేడ్ మెట్, డిసెంబర్ 18,ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజక వర్గం పరిధిలోని ఓల్డ్ నేరేడ్మెట్ లో గొట్ల రాజు యాదవ్, గొట్ల శంకర్ యాదవ్ ల సంయుక్త ఆధ్వర్యం లో ఐదవ అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ 41 రోజులు భక్తి శ్రద్ధల తో పూజలు నిర్వహించారు అనంతరం ప్రతి సంవత్సరంలాగే అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు భక్తి భావంతో ఉండాలని అప్పుడే జనులకు మనశాంతి ఉంటుందన్నారు. అయ్యప్ప ఎంతో మహిమగల దేవుడన్నారు. ఈ కార్యక్రమంలో గొట్ల రాజు యాదవ్,గొట్ల శంకర్ యాదవ్,గొట్ల అనీష్ యాదవ్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు...

### ఆటో నడిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఆటోలో అసెంబ్లీకి వెళుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్‌తో కలిసి ఆయన ఆటో నడుపుతూ అసెంబ్లీకి చేరుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మెనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు పాల్గొన్నారు.

### చలో రాజ్‌భవన్‌కు తరలివెళ్లిన ఉప్పల్ కాంగ్రెస్ నేతలు



చలో రాజ్‌భవన్ ర్యాలీగా ఉప్పల్ నుంచి తరలివెళుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

**ఉప్పల్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** దేశ సంపదను, అర్థిక సంస్థలను మోసగిస్తున్న ఆదానీపై జెపిసి వేసి చట్టపరమైన విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు పిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ ముట్టడికి ఉప్పల్ నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ర్యాలీగా తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు రాజ్‌భవన్ ముట్టడిలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాలో లంచాలు ఇచ్చిన ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ విషయంలో పార్లమెంటరీ కమిటి వేయకుండా ప్రధాని మోడీ మౌనంగా ఉంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం తీవ్రతరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

### సత్యనారాయణస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు



ఆలయంలో హుండీ లెక్కింపు చేస్తున్న భక్తులతో ఆలయ అధికారులు దృశ్యం.

**రామంతాపూర్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో హుండీని బుధవారం దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయభారతి, పౌండర్ ఫ్యామిలీ మెంబర్ కోట్ల నరసింహారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆలయం హుండీ లెక్కింపు చేస్తామని, బుధవారం జరిపిన లెక్కింపులో మొత్తం రూ.2.91.203 వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయం అభివృద్దికి భక్తులకు తగు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

### శ్రీ సత్యదేవుడి ఆలయంలో ధనుర్మాస పూజలు

**రామంతాపూర్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ధనుర్మాస పూజలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయభారతి, పౌండర్ ఫ్యామిలి మెంబర్ కోట్ల నరసింహారెడ్డి, శంకర్ తదితరుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు తిరుతాచార్యులు, శేషాచార్య, సీతారామ అచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.ధనుర్మాసంలో విష్ణుడికి ప్రీతికరమైన మాసమని, ఈ మాసంలో పూజలు చేస్తే పుణ్యఫలం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. ఉదయం సుప్రభాతానికి బదులుగా తిరుప్పావైం చేశారని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** స్వచ్ఛందంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ సింగిల్ విండో మాజీ ఛైర్మన్, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో బిజెపి నాయకులు కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, నాయకులు చెవ్వ శ్రవణ్‌కుమార్, మాదరి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి, బిఆర్ఎస్‌లకు ప్రజలే గుణపాఠం చెబుతారు : శ్రీనివాస్

**సైదాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మోది..కెసిఆర్‌లు వేర్వేరు కాదని ఇద్దరు నాణానికి బొమ్మ, బొరుసు అని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఛల్ రాజ్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ బిజెపికి లొంగి పోయిందని, అందువల్లే ఆదానికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజలవైపా లేక ఆదాని..ప్రధాని వైపా తేల్చి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీల చీకటి పొత్తు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో వారే బుద్దిచెపుతారని ఆయన పేర్కొన్నారు.

## సరూర్‌నగర్ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు



గుర్రపుడెక్క తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది స్థానికులు ఇబ్బందులకు గురవుతుండడంతో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశంనిర్వహించి చెరువులో గుర్రపు డెక్క తొలగించే పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలో గుర్రపు డెక్క తొలగింపు పనులను బుధవారం పర్యవేక్షించిన అనంతరంన కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. చెరువులో గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి ఎఇ భారతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సంకట హర చతుర్థి సందర్భంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న దేవాలయ అర్చకులు

**సైదాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** సంకట హర చతుర్థి సందర్భంగా శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. శ్రీ గణనాథుడి మూల విరాట్టుకు ప్రాత:కాల అభిషేకము అనంతరంన కార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు చంద్రకాంత్ శర్మ, దైత పవన్ కుమార్, అర్చకులు కె.సంతోష్‌కుమార్, జి.శ్రీనివాస్‌లు స్వామి వారికి అభిషేకము, హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు. దేవాలయ సిబ్బంది ఎం.వెంకటయ్య, జి.రమాదేవి, టి.వేణుగోపాల్ తదితరులు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

### సీనియర్ సిటిజన్లకు అండగా నిలుస్తాం : విజయరంగ



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** ఎంతో అనుభవం గడిచిన సీనియర్ సిటిజనులకు తాము అండగా నిలుస్తామని లైన్స్‌క్లబ్ హెల్త్ క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా పేర్కొన్నారు.జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా కొత్తపేట న్యూమారుతీనగర్ సీనియర్ సిటిజన్స్ భవనంలో లయన్ డాక్టర్ బి.విజయరంగ ఆధ్వర్యంలో పెన్షనర్స్ కు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించి వారితో కేక్‌కట్ చేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ అధ్యక్షులు నరసింహరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తిగౌడ్, కోశాధికారి బొగ్గారాపు వెంకటేశం, కొత్తపేట ప్రభుత్వ పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, స్టాఫ్‌నర్స్ నాగేశ్వేరి పాల్గొని పెన్షనర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది పెన్షనర్లు పాల్గొని వారి విధుల్లో ఉన్నపుడు చేసిన సేవలను పంచుకున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో ఉత్తమ సేవలు అందించాలి:పవన్




కార్పొరేటర్ పవన్‌కుమార్ను సన్మానిస్తున్న రామారావు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ ప్రజయ్‌నివాస్ ఫేస్ 1లోని బస్తీ దవాఖానాను బుధవారం కార్పొరేటర్ సందర్శించారు.బస్తీ దవాఖానలో సౌకర్యాలను పరిశీలించి వైద్యులు సిబ్బందితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దవాఖానలో ప్రజలకు సరైనటువంటి సమయంలో అందుబాటులో వుండాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని, ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి నూతన నూతన వైద్యురాలు డాక్టర్ సౌమ్య, ఇంచార్జీ రేష్మాను సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామారావు శాలువాతో సత్కరించి కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ప్రసాద్, లింగేశ్వర్, సాయి, రవి , రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల అరెస్ట్

**మేడిపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం, ప్రతాపసింగారం తేజస్వీకాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తిరుపతి, కానిస్టేబుల్స్ అశోక్, శ్రీకాంత్, నవీన్ ఆధ్వర్యంలో ఇంటిపై దాడి చేసి ఇంట్లో పేకాట ఆడుతున్న తన్నీరు స్వామి(43), మేదురి ప్రవీణ్‌కుమార్ (33), బాతుల వెంకట బ్రహ్మయ్య (46), గంగటి మాల్యాద్రి(37), మామినాల నగేష్‌కుమార్ (37)లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.13.200 నగదుతోపాటు, 4 సెల్ పోన్లు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.